క్లుప్తంగా

చిరువ్యాపారులకు బండ్లు అందజేత

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం రేవేంద్రపాడుకు చెందిన చిరు వ్యాపారులు వేలుకూరి గోపి, చిన్ని రవి, ఆరేపల్లి రజనీలకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆర్థిక సహాయంతో తోపుడు, టిఫిన్ బండ్లను అందజేశారు. ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ గురువారం వ్యాపారులకు అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజి, వైఎస్సార్ సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షులు దానబోయిన వెంకటేశ్వరరావు (డీవీఆర్), రేవేంద్రపాడు సర్పంచ్ పలుకూరి మేరిరాణి, ఉప సర్పంచ్ మధు నాగదుర్గ, మాజీ ఎంపీపీ చల్లపల్లి భారతిదేవి, జేసీఎస్ కన్వీనర్ శృంగారపాటి రత్నం, వైఎస్సార్ సీపీ నాయకులు శామ్యూల్, జానీబాషా, కొప్పుల ప్రకాష్‌రావు, కనపర్తి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఫోర్టిఫైడ్ బియ్యం వినియోగంపై అవగాహన

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని చిలువూరు గ్రామంలో 3,4 అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం ఫోర్టిఫైడ్ బియ్యం వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సూపర్‌వైజర్ బి.జ్యోతి మాట్లాడుతూ ప్రజలు తప్పక ఫోర్టిఫైడ్ బియ్యాన్ని వినియోగించాలని అన్నారు. ఈ బియ్యంలో ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బి12 వంటివి పుష్కలంగా ఉంటాయని, వీటిని వినియోగించడం వల్ల తల్లులకు, పిల్లలకు మంచి పోషకాలు అందుతాయని వివరించారు. కార్యక్రమంలో చిలువూరు సర్పంచ్ చిలువూరు మాణిక్యం, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ వేంకటేశ్వరుడికి విశేషపూజలు

ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు గ్రామంలోని పద్మావతి, అలివేలు మంగాసమేత కల్యాణ వేంకటేశ్వరుడి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా గురువారం 16 రోజుల పండుగ నిర్వహించారు. ఉదయాన్నే అర్చకులు శ్రీనివాసరెడ్డి స్వామివార్లకు అష్టోత్తర, సహస్రనామాలతో పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం ఆలయంలో భజన కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా బ్యాంక్ ఆఫ్ బరోడా వ్యవస్థాపక దినోత్సవం



మంగళగిరి: నగరంలోని దేవస్థానం రోడ్ గల బ్యాంక్ ఆఫ్ బరోడా 116వ వ్యవస్థాపక దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. బ్యాంక్ మేనేజర్ దాసరి అశోక్ కుమార్ కేక్ కట్ చేసి ఖాతాదారులకు మిఠాయి పంచిపెట్టారు. కార్యక్రమంలో ఖాతాదారులు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, పిత్తాళ్ల మస్తాన్‌రావు, పారేపల్లి మహేష్‌లతో పాటు బ్యాంక్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులు తగిన జాగ్రత్తలు పాటించాలి



ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్, వేములూరిపాడు గ్రామాల్లోని సబ్‌సెంటర్లలో గురువారం గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి యానీగ్రేస్ అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు ఉప్పు, మసాలా దినుసులు ఉన్న ఆహారం తగ్గించాలని సూచించారు. కాళ్ల వాపు తగ్గకుండా ఉండటం, తలనొప్పి, కళ్లు తిరగటం వంటి లక్షణాలు ఉన్నప్పుడు తప్పనిసరిగా వైద్యులను సంప్రదించాలన్నారు. ప్రతి నెలా తగిన పరీక్షలు, బీపీ, షుగరు, థైరాయిడ్ పరీక్షలు సబ్‌సెంటర్లలో చేయించుకొని మందులు వాడాలని అన్నారు. నొప్పులు వస్తున్న సమయంలో వైద్యశాలల్లో చేరాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు స్వప్న, అనూష, ఏఎన్‌ఎంలు అరుణ, ఆంతోనిరాణి, బాబురావు, ఆశాలు సుజాత, పద్మ, జోజమ్మ, శాంతరాణి, శాంతకుమారి, నజీరున్నీసా, మస్తానమ్మలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే ఆర్కే సాయం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం పెనుమూలికి చెందిన భీమవరపు భూలక్ష్మి, నంబూరు వెంకటేష్, కుందేటి సామ్రాజ్యం, సయ్యద్ సలాం బాషాలు అనారోగ్య సమస్యలతో బాధపడుతుండగా ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆర్థిక సాయం ప్రకటించారు. ఆ మొత్తాన్ని బాధితులకు ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణలు గురువారం అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ, ఎంపీటీసీ సభ్యుడు షేక్ సల్మా, ఉప సర్పంచ్ తియ్యగూర భాగ్యలక్ష్మి, జేసీఎస్ కన్వీనర్ శృంగారపాటి రత్నం, వైఎస్సార్ సీపీ నాయకులు నజీర్, గరిక కోటేశ్వరరావు, ప్రకాష్, చలంచర్ల సాంబయ్య, ఆరుమళ్ళ రంగారెడ్డి, శేషిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించడమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)
- వైద్యాధికారి అనూషకు సత్కారం



గణపతినగర్ వైఎస్సార్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అనూషను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు

మంగళగిరి: పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని, వైద్య రంగ అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అన్నారు. ఆత్మకూరు గణపతినగర్‌లోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఏపీలోనే తొలిగా నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్డ్స్ (ఎన్‌క్వాస్) గుర్తింపు పొందిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో గురువారం ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలసి వైద్యశాలను సందర్శించి వైద్యాధికారి పి అనూషను సత్కరించారు. అనంతరం ఆయా విభాగాలను సందర్శించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ రాష్ట్రంలోనే ఉత్తమ యూపీహెచ్‌సీగా గణపతినగర్‌లోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు ఎన్‌క్వాస్ గుర్తింపు లభించిందని, ఈ మేరకు బుధవారం కేంద్ర ప్రభుత్వం కుటుంబ ఆరోగ్య మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ చౌహాన్ ఉత్తర్వుల కాపీని విడుదల చేశారన్నారు. గణపతినగర్ యూపీహెచ్‌సీ రాష్ట్రంలోనే తొలి ఉత్తమ యూపీహెచ్‌సీగా ఎంపిక కావడం ఎంతో గొప్ప విషయమని, అందుకు సహకరించిన రాష్ట్ర, జిల్లా వైద్యశాఖ అధికారులకు, సిబ్బందిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్లు చెప్పారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యూపీహెచ్‌సీల నిర్మాణానికి రూ.80 లక్షల నిధులను కేటాయించారని, అందులో భాగంగా మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని తొమ్మిది యూపీహెచ్‌సీల నిర్మాణానికి రూ.7.20 కోట్లు కేటాయించగా అదనంగా మరో రూ.7.50 కోట్ల కార్పొరేషన్ నిధులతో సకల హంగులతో నిర్మించామన్నారు. కార్యక్రమంలో స్టేట్ ఎన్‌క్వాస్ క్వాలిటీ ప్రోగ్రామ్ అధికారి రామారావు, క్వాలిటీ కన్సల్టెంట్ డాక్టర్ నరేంద్ర, జిల్లా క్వాలిటీ మేనేజర్ వాసు, డీపీఓ సైమన్, వైఎస్సార్ సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, పట్టణ జేసీఎస్ కన్వీనర్ ఎండీ ఫిరోజ్, ఆకురాతి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నేతన్న విగ్రహం ఏర్పాటుకు స్థల పరిశీలన

మంగళగిరి: నేతన్నల కీర్తి ప్రతిష్టలు ప్రతిబింబించేలా ఎన్నారై జంక్షన్‌లో నేతన్న విగ్రహంతోపాటు జాతీయ పతాకం ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) తెలిపారు. గురువారం ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలసి ఎన్నారై జంక్షన్‌లో నేతన్న విగ్రహం ఏర్పాటు చేయనున్న స్థలాన్ని పరిశీలించారు. నేతన్న విగ్రహంతోపాటు అదే ప్రాంతంలో జాతీయ పతాకం ఏర్పాటు చేసి ఆగస్టు 15వ తేదీన నేతన్న విగ్రహంతోపాటు జాతీయ పతకాన్ని ఆవిష్కరించేలా పనులు పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. విగ్రహం ఏర్పాటుతోపాటు భారీ జాతీయ పతాకం ఏర్పాటు కోసం అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీసీపీ మహాలక్ష్మి దొర, ఏసీపీ వెంకటేశ్వర్లు, డీఈ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే

తాడేపల్లిరూరల్: ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి గురువారం ఆకస్మికంగా ఓ ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేసి మధ్యాహ్నం విద్యార్థులతో కలసి భోజనం చేశారు. ఎమ్మెల్యే ఆర్కే పాఠశాలలో మొట్టమొదటగా విద్యార్థుల పాఠ్య పుస్తకాలను, ప్రభుత్వం అందజేసిన జగనన్న కిట్స్ ఏవిధంగా ఉన్నాయో పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో కలసి కింద కూర్చుని భోజనం చేశారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ పోలకంపాడులో ఉన్న ప్రభుత్వ పాఠశాలకు నాడు నేడు కింద ప్రభుత్వం మరమ్మతులు చేసేందుకు రూ.ఆరు లక్షల నిధులు కేటాయించిందని, ఆ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, గోరుముద్ద భోజనం చాలా రుచికరంగా ఉందని గురువారం అక్షయ పాత్ర వారు పంపించే పులిహోర, టమాట చట్నీ విద్యార్థులకు అందజేశారని, ప్రతి విద్యార్థితో జగనన్న గోరుముద్ద మెనూ ప్రకారం అన్నీ అందుతున్నాయా అని అడగ్గా విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తాడేపల్లి పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాలస్వామిరెడ్డి, గృహసారథుల జేసీఎస్ కన్వీనర్ ఈదులమూడి డేవిడ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

సవరణలను సునిశితంగా పరిశీలించాలి



తాడికొండ: ఓటర్ల జాబితాలో సవరణలను రాజకీయపార్టీలు సునిశితంగా పరిశీలించి సర్వే అధికారులకు సహకరించాలని తాడికొండ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కేఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం వెంకట శివరామిరెడ్డి సూచించారు. ఓటరు జాబితా సిద్ధం చేసేందుకు బీఎల్‌వోలు, బీఎల్ఏలు, పర్యవేక్షకులు నేటి నుంచి నెల రోజులపాటు ఇంటింటి సర్వే నిర్వహించనున్న నేపథ్యంలో నియోజకవర్గంలోని అన్ని రాజకీయపార్టీలతో ఆయన సమావేశం నిర్వహించారు. సర్వే సమయంలో అధికారుల వెంట రాజకీయపార్టీల నాయకులు పాల్గొనే అవకాశం లేదని, సిబ్బందికి అభిప్రాయాలు, సూచనలు తెలియజేసి సహకరించాలన్నారు. సర్వేలో భాగంగా నూతన ఓటర్ల నమోదు, అడ్రసు మార్పు, వయస్సు మార్పు సవరణ చేయడంతోపాటు మరణించిన వారిని తొలగించుటకు కావలసిన సంబంధిత ఫారాలను పక్కాగా పూర్తిచేసి మరణ ధృవీకరణ పత్రాలను జతచేసి తొలగించాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని 4 మండలాల పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే జగనన్న సురక్ష లక్ష్యం



లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, అడిషనల్ కమిషనర్ హేమమాలిని



కంతేరులో లబ్ధిదారులకు పత్రాలు అందజేస్తున్న బత్తుల బ్రహ్మానందరెడ్డి, కత్తెర సురేష్ కుమార్

ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

మంగళగిరి: ప్రజా సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు తెలిపారు. నగర పరిధిలోని 10,11, సచివాలయాలు కూరగాయల మార్కెట్, కొప్పురావు కాలనీ, కాజ-1వ సచివాలయంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్సీ హనుమంతరావు లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగపర్చుకుని 11 రకాల సర్వీసులను ఉచితంగా పొందాలన్నారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ జీవీ రామ్‌ప్రసాద్, అడిషనల్ కమిషనర్ హేమమాలిని, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాస నాయక్, సెక్రటరీ రమేష్, జేసీఎస్ రూరల్ కన్వీనర్ అన్నపురెడ్డి బ్రహ్మారెడ్డి, పార్టీ గ్రామ అధ్యక్షుడు ఆర్ల బ్రహ్మయ్య, సచివాలయ కన్వీనర్లు కమ్మెల సుబ్బారావు, మందా విజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

మేడికొండూరు: రాష్ట్రంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా అన్నారు. మేడికొండూరు, వెలవర్తిపాడు గ్రామాల్లో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. క్రిస్టినా మాట్లాడుతూ ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందేలా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని అన్నారు. అర్హులై ఉండి ఇంకా సంక్షేమ పథకాలు అందని వారు ఉంటే వారి వివరాలు సేకరించి అందేలా చేస్తామని చెప్పారు. రానున్న ఎన్నికలలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్ధయ్య, ఎంపీపీ మన్నవ స్వప్న, వెలవర్తిపాడు ప్రెసిడెంట్ ఎం.విజయలక్ష్మి, భీమినేనివారిపాలెం గ్రామ సర్పంచ్ ఆలూరి శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ బాజి, చంటి బాజి, ఎంపీడీఓ కె ప్రభాకరరావు, జేసీఎస్ కన్వీనర్ అబ్బాస్, కొరికి చెన్నయ్య, ఎంపీటీసీ సభ్యులు ముంతాజ్,



మేడికొండూరులో సర్టిఫికెట్‌లు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ హెనీక్రిస్టినా

చాపరాల కృష్ణమోహన్, డి సుధీర్, సుభాని, ఏపీఎం విజయభారతి, పలుశాఖల మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ఇంటి వద్దకే పత్రాలు

తాడేపల్లిరూరల్: జగనన్న సురక్షతో అన్ని వర్గాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందని దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ అన్నారు. గురువారం మండల పరిధిలోని రేవేంద్రపాడు, గొడవర్రు, వీర్లపాలెం గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి సచివాలయం పరిధిలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతోందని, పేద ప్రజలకు సంక్షేమ పథకాలకు అవసరమైన దరఖాస్తులు స్వీకరించడంతోపాటు విద్యార్థులకు అవసరమైన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా పొందే అవకాశాన్ని కల్పించిందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లేశ్వరి, ఎంపీడీఓ కుసుమశ్రీదేవి, మాజీ ఎంపీపీ చల్లపల్లి భారతి, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజి, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు దానబోయిన వెంకటేశ్వరరావు (డీవీఆర్), రేవేంద్రపాడు సర్పంచ్ పలుకూరి మేరిరాణి, వీర్లపాలెం సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ శృంగారపాటి రత్నం, మోరంపూడి సర్పంచ్ ఇత్తడి రమేష్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి తలుపు తట్టి సంక్షేమాన్ని అందిస్తున్న సీఎం

కంతేరు(తాడికొండ): ప్రతి ఇంటి తలుపు తట్టి పార్టీలకతీతంగా సంక్షేమాన్ని అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. తాడికొండ మండలం కంతేరు గ్రామంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ నాలుగేళ్ల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో 455 రకాల సేవలను ప్రజా సంక్షేమం కోసం అవసరాలను గుర్తించి అందించడం జరిగిందన్నారు. కేవలం పేదల సంక్షేమం కోసమే రూ.2.60 వేల కోట్లు కేటాయించిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒక్కటే అన్నారు. లబ్ధిదారులకు ధ్రువ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బెజ్జం మహేష్‌బాబు, ఎంపీటీసీ వలపర్ల కల్పన, సొసైటీ చైర్మన్ మేడా శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ నరసింహారావు, రాష్ట్ర కార్యదర్శి బొర్రా వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు హరికృష్ణారెడ్డి, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

సమస్యల రహిత రాష్ట్రం ఏర్పాటే లక్ష్యంగా జగనన్న సురక్షా

సమస్యలు రహిత రాష్ట్రం ఏర్పాటే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్షా కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారని వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. తుళ్లూరు మండలం రాయపూడి, తుళ్లూరు గ్రామాల్లో నిర్వహించిన జగనన్న సురక్షా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. లబ్ధిదారులకు ధ్రువ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ బండి ప్రసాద్, మైనార్టీ నాయకులు రెహమాన్, జానీ బాషా, తుళ్లూరు సొసైటీ అధ్యక్షుడు గద్దె శ్రీనివాసరావు, గ్రామపార్టీ అధ్యక్షుడు ఆలోకం సురేష్, నేలపాటి నాగేంద్ర, ఆరేపల్లి జోజి పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని 7,10 సచివాలయాల్లో గురువారం అడిషనల్ కమిషనర్ బిక్కిరెడ్డి శివారెడ్డి, సెక్రటరి శ్రీనివాసరావు అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ రెండు కార్యక్రమాల్లో పాల్గొన్న గృహసారథుల జేసీఎస్ కన్వీనర్ ఈదులమూడి డేవిడ్‌రాజు, అధికారులు, గృహసారథులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో కలసి అర్హులైన వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాలస్వామిరెడ్డి, గృహసారథులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులు

అఖిలపక్ష సమావేశంలో తహసీల్దార్ జీవీ రామ్‌ప్రసాద్



మాట్లాడుతున్న తహసీల్దార్ జీవీ రామ్‌ప్రసాద్, హాజరైన అఖిలపక్ష నాయకులు

మంగళగిరి: ఓటర్ల జాబితాలో మార్పులు–చేర్పులు ప్రక్రియ శుక్రవారం నుంచి ప్రారంభమవుతుందని తహసీల్దార్ జీవీ రామ్‌ప్రసాద్ అన్నారు. నగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఓటర్ల జాబితాపై అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాల సవరణపై వీఆర్‌ఓలు, ఏవీఆర్‌ఓలు, బీఎల్‌ఓలకు శిక్షణ ఇచ్చామని తెలిపారు. శుక్రవారం నుంచి ఇంటింటికి వెళ్లి వెరిఫికేషన్ చేస్తారని తెలిపారు. ఆగస్టు 22 నుంచి సెప్టెంబర్ 29 వరకు పోలింగ్‌స్టేషన్ ఏర్పాట్లపై పరిశీలన, ఓటర్ల జాబితాలో మార్పులు–చేర్పులు, సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 16 వరకు ఓటర్ల జాబితా డ్రాఫ్ట్ ప్రకటించడం జరుగుతుందన్నారు. అక్టోబర్ 17న ఓటర్ల జాబితాలు నోటీసు బోర్డులో ఉంచడం జరుగుతుందన్నారు. అక్టోబర్ 17 నుంచి నవంబర్ 30 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తామని తెలిపారు. శని, ఆదివారాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించి ఉదయం నుంచి సాయంత్రం వరకు బీఎల్‌ఓలను ఓటర్లకు అందుబాటులో ఉంచడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని ఓటర్లు వినియోగించుకుని తమ ఓటును ఓటర్ల జాబితాలో సరి చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎలక్ట్రోల్ రిజిస్టర్ ఆఫీసర్ (ఈఆర్‌ఓ) లలిత, అడిషనల్ కమిషనర్ హేమమాలిని, డిప్యూటీ కమిషనర్ శివారెడ్డి, తాడేపల్లి, దుగ్గిరాల తహసీల్దార్లు నాగిరెడ్డి, మల్లేశ్వరి, వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్‌రాజు, సోషల్ మీడియా కన్వీనర్ మేకా వెంకట్రామిరెడ్డి, కొత్తపల్లి మోహనరావులతోపాటు టీడీపీ, సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్లోరినేషన్

తాడికొండ: వర్షాకాలం వ్యాధుల సీజన్ ప్రబలే అవకాశాలు ఉన్న నేపథ్యంలో తాడికొండలో బావుల్లో క్లోరినేషన్ ప్రక్రియ కొనసాగుతుంది. దోమలు ప్రబలి విష జ్వరాలు రాకుండా ఉండేందుకు గానునీటి గుంతల్లో బ్లీచింగ్, దోమల మందు పిచికారీ చేస్తున్నట్లు కార్యదర్శి పి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగడం ద్వారా 90 శాతం రోగాలను అరికట్టవచ్చని ఆయన సూచించారు.

రైతుల సమస్యలను తక్షణం పరిష్కరించాలి

తాడేపల్లిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం తక్షణం రైతుల సమస్యలను పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు డిమాండ్ చేశారు. గురువారం ఉండవల్లిలో రైతు సంఘం సమావేశం నిర్వహించారు. సమావేశానికి కె.ఈశ్వరరెడ్డి అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ కొండవీటి వాగులో తూటికాడ, గుర్రపు డెక్కను తొలగించి పూడికతీత పనులు చేయాలని, యూటికే పంపింగ్ స్కీమ్ మరమ్మతులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వీరాస్వామి, భక్తిరెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

23న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల 'చలో విజయవాడ'

నెహ్రూనగర్: ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల హక్కుల సాధన కోసం ఈ నెల 23న 'చలో విజయవాడ' నిర్వహిస్తున్నట్లు సమాఖ్య జేఏసీ అధ్యక్షుడు చుక్కా నాగభూషణం తెలిపారు. లాడ్జి సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పదోన్నతుల్లో ఎస్సీలకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రభుత్వం వద్ద వినిపించేందుకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అధికారుల జేఏసీగా ఏర్పడి విజయవాడలో ఆదివారం ధర్నా నిర్వహిస్తున్నట్లు వివరించారు.

16 ఏళ్ల నిరీక్షణ ఫలించింది



కాలువలో జేసీబీతో పూడిక తీస్తున్న దృశ్యం



పూడికతీత అనంతరం పెదకొండూరు కాలువ

- పెదకొండూరు చానల్‌లో పూడికతీత పనులు ప్రారంభం
- చొరవ చూపించిన ఎమ్మెల్యే ఆర్కే

తాడేపల్లిరూరల్: రైతుల 16 ఏళ్ల నిరీక్షణ ఫలించింది. పెదకొండూరు కాలువ పూడిక తీత పనులు గురువారం ప్రారభమయ్యాయి. 11 కిలోమీటర్ల మేర ప్రవహించే పెదకొండూరు కాలువ కింద కాలువ రేవేంద్రపాడు, నూతక్కి, కొత్తపాలెం, వీర్లపాలెం, పెదకొండూరు, గొడవర్రు గ్రామాలకు చెందిన రైతులు 2000 ఎకరాలలో వరి సాగు చేస్తున్నారు. కాలువ పూడిక పేరుకుపోయింది. 16 ఏళ్లుగా పూడిక తీయడం లేదు. నీరందక పంటలు ఎండిపోయి రైతులు ఏటా నష్టపోతున్నారు. రెండు రోజుల కిందట ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)కి రైతులు తమ పరిస్థితిని వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఇరిగేషన్ శాఖ మంత్రి అంబటి రాంబాబుతో మాట్లాడి రైతుల పరిస్థితి వివరించారు. నిధులు కేటాయించడంతో పనులు ప్రారంభించారు. పనులు ప్రారంభం కావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యం

ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి. కృష్ణయ్య

పాత గుంటూరు: రైతు, కార్మిక, ప్రజా సంఘాల ఐక్యతతో నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని గద్దెదించాలని కోరుతూ ఈనెల 30న విజయవాడలో జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య కోరారు. బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో గురువారం రైతు, కార్మిక, ప్రజా సంఘాల జిల్లా సదస్సు నిర్వహించారు. సభకు ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్‌కుమార్ అధ్యక్షత వహించారు. కృష్ణయ్య మాట్లాడుతూ భారత వ్యవసాయానికి, రైతాంగానికి తీవ్రమైన హాని కలిగించే మూడు నల్ల వ్యవసాయ చట్టాల్ని రద్దు చేస్తానని నరేంద్ర మోదీ రైతులకు హామీ ఇచ్చి ఇప్పటికీ అమలు చేయలేదని తెలిపారు. పార్లమెంట్‌లో విద్యుత్ బిల్లును ప్రవేశపెట్టడమే కాకుండా పంపు సెట్లకు స్మార్ట్ మీటర్ల వేగవంతం చేస్తున్నారన్నారు. రైతుల సమస్యలపై పోరాటం సాగించాలని సంయుక్త కిసాన్ మోర్చా నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. తెలుగు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కళ్లం రాజశేఖర్‌రెడ్డి, కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిపి.జమలయ్య, తెలుగు రైతు రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి టి.లక్ష్మణ్ రెడ్డి, కిసాన్‌క్రాంతి సంఘర్ష సంఘంరాష్ట్ర కార్యదర్శి మన్నవ ఉన్నారు.

30న సినీ సంగీత విభావరి

పాత గుంటూరు: గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈ నెల 30న ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్ట్, గీతాంజలి ఈవెంట్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఏషామ్ మస్తాని-14 పేరుతో సినీ సంగీత విభావరి నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే సంగీత విభావరిలో ప్రముఖ గాయని శ్రీ లలిత, పలువురు గాయకులు పాల్గొని సినీ పాటల్ని ఆలపిస్తారు. కామెడీ కింగ్ శివ మిమిక్రీ ఉంటుంది.